క్లుప్తంగా

యోగాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలోని యోగాంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శోభనాచల స్వామి వారికి అష్టోత్తర శత కలశ స్నపన, స్వామికి విశేషాలంకరణను అర్చకులు జరిపించారు. అనంతరం ఆలయంలోని యోగాంజనేయ స్వామికి ఉత్సవ శాంతిలో భాగంగా పంచామృత స్నపన, సహస్ర తమల పత్రార్చన, అప్పాల నివేదన, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగాలను అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ఘనంగా నిర్వహించారు.

ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ గ్రౌండ్‌లో నారాయణ స్కూల్స్ వెస్ట్ జోన్ ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాలల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణాలు ఎలా?



చాట్రాయి: ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్లపై ప్రయాణాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని చనుబండ నుంచి నరసింహారావుపాలెం వరకు అడుగడుగునా గుంటలు పడడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రహదారులపై ప్రయాణాలు చేయాలంటే ప్రజలు హడలిపోతున్నారు. చిత్తపూరు నుంచి బూరుగుగూడెం వరకు మరమ్మతులు చేపట్టి పర్వతాపురం చిన్నంపేట, చీపురుగూడెం వరకు గుంటలను లెవలింగ్ చేసి నిలిపివేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రవేశిక, విశారద పరీక్షలు



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ హిందీ పరీక్షలు తిరువూరు సర్వోదయ స్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట తదితర మండలాల నుంచి విద్యార్థులు ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు హాజరయ్యారు. ఆదివారం కూడా పరీక్షలు కొనసాగుతాయని ప్రచార సభ హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ యర్రమిల్లి రమణమూర్తి పర్యవేక్షించారు.

కల్యాణ మండపం ప్రారంభం



లక్ష్మీపురం(తిరువూరురూరల్): తిరువూరు మండలం లక్ష్మీపురం సమీపంలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపాన్ని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన సామాజిక వన పథకం

- రూ. లక్షల్లో వన సంరక్షణ సమితులకు బకాయిలు
- నిరుపయోగంగా రిజర్వుడు అటవీ భూములు
- పట్టించుకోని అటవీ అధికారులు

తిరువూరు: కేంద్ర ప్రభుత్వం 1989లో చేపట్టిన సామాజిక వన పథకం అధికారుల నిర్లక్ష్యంతో అటకెక్కింది. నిరుపయోగంగా ఉన్న అటవీ, బంజరు భూముల్లో మొక్కల పెంపకం ద్వారా గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ఈ పథకం లక్ష్యం. మైలవరం, ఎ.కొండూరు అటవీ సెక్షన్లలో 1,500 ఎకరాల్లో సామాజిక వనాలను పెంచాలని లక్ష్యంగా తీసుకున్న అధికారులు తదనుగుణంగా మొక్కలు సరఫరా చేసి అటవీ భూముల్లో నాటించారు.

జామాయిల్ మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత వాటిని నరికి విక్రయించిన సొమ్మును కూలీలకు అందజేసేవారు. సామాజిక వనాల పెంపు కోసం ఏర్పాటు చేసిన వన సంరక్షణ సమితులకు సైతం ఇదే విధంగా ప్రోత్సాహాన్ని అందించేవారు. గత దశాబ్ద కాలంగా వన సంరక్షణ సమితులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించడంలో అటవీ శాఖాధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తుండటంతో సామాజిక వనాలు కనుమరుగయ్యాయి.



తిరువూరు మండలంలోని సామాజిక అడవులు

నిరుపయోగంగా అటవీ భూములు

తిరువూరు మండలంలోని చిట్టేల, ఆంజనేయపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాల్లో సామాజిక వన పథకాన్ని చేపట్టిన అటవీ శాఖ మొక్కల పెంపకందారులను ప్రోత్సహించడంలో వెనుకడుగు వేసింది. వన సంరక్షణ సమితుల అధ్యక్షులు, అటవీ అధికారులతో సంయుక్త బ్యాంకు ఖాతాను తెరిచి సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసే సొమ్మును జమ చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. భూమి చదును చేసి, సాగుకు సిద్ధం చేయడం, మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చూడటంలో వీఎస్ఎస్ సభ్యులు గణనీయ పాత్ర పోషించినప్పటికీ వారి కష్టానికి తగిన ప్రతిఫలం లేకపోవడంతో ఇతర పనుల్లోకి వెళ్లిపోతున్నారు.

రూ. లక్షల్లో బకాయిలు..

తిరువూరు మండలంలోని కాకర్ల–రామన్నపాలెం, ఆంజనేయపురం, చౌటపల్లి వన సంరక్షణ సమితుల్లో 300 మందికి పైగా సభ్యులుండగా మొక్కల పెంపకం బాధ్యతలు చూసినందుకు వీరికి రూ.లక్షల్లో బకాయిలు రావలసి ఉంది. అటవీ అధికారులు కూడా వన సంరక్షణ సమితుల సభ్యుల ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వానికి నివేదించకపోవడంతో సామాజిక వన పథకం ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

పునరుద్ధరించాలి



పేద వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించడంలో కీలకంగా ఉన్న వన సంరక్షణ సమితులను వెంటనే పునరుద్ధరించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక, పూట గడవని పేద కుటుంబాలకు ఆసరాగా ఉన్న వీఎస్ఎస్‌లకు గతంలో రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

– కోటేశ్వరరావు, ఆంజనేయపురం వీఎస్ఎస్ అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



వన సంరక్షణ సమితుల సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. మొక్కలు పెంచి వాటిని సంరక్షించిన వన సంరక్షణ సమితుల సభ్యులను గురించి అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం.

– మామిడి కుటుంబరావు, సర్పంచి, ఆంజనేయపురం

బకాయిలు రావలసి ఉంది

వన సంరక్షణ సమితుల సభ్యులు సామాజిక అటవీ పథకంలో పనిచేసినందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావలసి ఉంది. ప్రస్తుతం మొక్కల పెంపకం జరగడం లేదు. వీఎస్ఎస్‌ల పునరుద్ధరణ గురించి ప్రభుత్వం చర్యలు తీసుకోవలసి ఉంది.

– విద్యాసాగర్, ఎ.కొండూరు అటవీ సెక్షన్ అధికారి

ముగిసిన వర్క్‌షాప్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవన విధానంలో భాగమైందని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య అన్నారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో మెషిన్ లెర్నింగ్, డేటా ఇంజినీరింగ్ అంశాలపై రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. టెక్నాలజీలో చెడును కాకుండా మంచిని స్వీకరించాలని సూచించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరాం, వివిధ విభాగాధిపతులు షేక్ షాబాజ్, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

ఇబ్రహీంపట్నం: సెయింట్ జేవియర్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల చైర్మన్ అర్జునరావు, కార్యదర్శి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సన్మానం

తిరువూరు: పాడి రైతుల సంక్షేమమే యూనియన్ ధ్యేయమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఎ.కొండూరు మండలం గొల్లమందలలో యూనియన్ వజ్రోత్సవాల సందర్భంగా పాడి రైతులను శనివారం ఆయన సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ రైతులకు ఎక్కువ బోనస్ అందిస్తోందన్నారు. తిరువూరు క్లస్టర్ మేనేజరు సాంబశివమూర్తి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఆంజనేయులును పాల ఉత్పత్తిదారులు సత్కరించారు.

ఏటీఎంల నిర్వహణ అధ్వానం

- సాంకేతిక సమస్యలతో మొరాయింపు
- అవుట్ ఆఫ్ సర్వీసు అంటూ బోర్డులు
- సెక్యూరిటీ గార్డులు లేని వైనం

ఆగిరిపల్లి: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు గ్రామాల్లో బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణ మాత్రం గాలికి వదిలేస్తున్నాయి. ఆగిరిపల్లి మండలంలో ఏటీఎం కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారింది. మండల పరిధిలో ఆరు బ్యాంకులు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు ఏడుకు పైగా వివిధ రకాల బ్యాంకుల ఏటీఎంలు ఉన్నాయి. ఆగిరిపల్లిలోని యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, ఏటీఎంలో నిత్యం రూ.లక్షల రూపాయలు డ్రా చేస్తుంటారు. కానీ ఏటీఎం కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం లేదు. ఏటీఎం మెషీన్‌లో డబ్బులు పెట్టి ఆ తర్వాత వాటి భద్రతను గాలికి వదిలేస్తున్నారని, కనీసం వాటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద కనీసం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయకపోవడంతో గతంలో స్టేట్ బ్యాంక్ ఏటీఎంను పగలగొట్టడానికి దుండగులు ప్రయత్నించారు. అయినా సరే భద్రత ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

తరచుగా సాంకేతిక సమస్యలు

ఏటీఎం కేంద్రాల్లో చాలా వరకూ ఏసీలు పనిచేయడం లేదు. ఆర్థిక భారం పడుతోందని బ్యాంకులు ఇలా చేస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాగే ఉంటే రానున్న వేసవిలో ఇబ్బంది తప్పదని చెబుతున్నారు. అలాగే ఎప్పుడు చూసినా సాంకేతిక కారణాలతో పని చేయడం లేదనో? ఏటీఎంలో నో మనీ అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులంతా ఏటీఎంలోనే అధికంగా నగదు డ్రా చేస్తుంటారు. నెల మొదటి వారంలో ఏటీఎం సెంటర్లకు తిరిగినా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. ఎక్కువ శాతం ఏటీఎం కేంద్రాల వద్ద నగదు లేదని, అవుట్ ఆఫ్ సర్వీస్ అని బోర్డులు దర్శనమిస్తుండటంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏటీఎంలు అన్నివేళలా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



ఆగిరిపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఏటీఎం

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మాణంలో ఉన్న పాటి మీద దాసాంజనేయ స్వామి ఆలయానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. సంకా శ్రీనివాసరావు రూ.లక్షా 1,116, బత్తుల ఆంజనేయులు రూ.లక్ష, కె. చిరంజీవరావు, శ్రీనివాసరావు రూ.60 వేలు, గుడిమెట్ల నాగ వెంకట సతీష్‌బాబు, మంజుల రూ.51,116, గుడిమెట్ల సురేష్‌బాబు, లక్ష్మీదేవి రూ.21,116, జంగాల మురళీకృష్ణ రూ.20,116, సోమవరపు చిన నరసింహారావు, కవిత రూ.10,116, డాక్టర్ వివేకానంద రూ.10,116, డాక్టర్ బాణోతు రమేష్ రూ.20,116, నాళ్ళా సత్యనారాయణ రూ.21,021, డాక్టర్ శ్రీనివాస బహదూర్ రూ.10వేలు, చిట్టిపోతుల లక్ష్మీనారాయణ రూ.10,116 విరాళాలు అందజేశారు. రాంబాబు, వెంకటేశ్వరమ్మ, నాగారపు సత్యనారాయణ, సోమవరపు వెంకట నాగేశ్వరరావు, కొంకిమళ్ళ పద్మావతి, కొదమసింహం జానకి, కంచర్ల కైలాస్‌నాథ్, పద్మ, బంటు గంగయ్య, లద్దిక వెంకటరమణ, గుడిమెట్ల సుబ్బారావు, కొత్తగుండ్ల సూర్యనారాయణరావులు రూ.5,116 చొప్పున విరాళాలు అందజేశారు.

మార్చి 9న ఆలయ ప్రతిష్ఠ

పునర్నిర్మాణం అనంతరం దాసాంజనేయస్వామి ఆలయాన్ని మార్చి 9న ఉదయం 10.53 గంటలకు పునఃప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రహదారులపై మురుగునీటి ప్రవాహం



చెక్కపల్లిలో ప్రధాన రహదారి పైకి చేరిన మురుగు నీరు



ముసునూరులో రహదారిపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ముసునూరు: ముసునూరు గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో స్థానికులు వాడిన నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ సొసైటీ ఎదురుగా ప్రధాన రహదారి, తూర్పు వీధి సీసీ రోడ్డు, చెక్కపల్లి గ్రామాల్లో ఇళ్లల్లో వాడిన నీరు రోడ్డు మార్జిన్లలో నిల్వ ఉంటోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో నుంచే వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుండటంతో చిరు వ్యాపారాలు ఇబ్బందులకు గురవుతున్నారు. తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ముసునూరు, చెక్కపల్లిల్లో డ్రెయినేజీలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.



ముసునూరు తూర్పువీధి రోడ్డుపై మురుగునీరు

దుర్గంధం భరించలేక పోతున్నాం

మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల నిలయాలుగా మారాయి. చిరు వ్యాపారులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. తక్షణం సమస్యను పరిష్కరించాలి.

– కూసం సత్యనారాయణ, చెక్కపల్లి

చర్యలు తీసుకుంటాం

ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతానికి తక్షణమే గ్రామ కార్యదర్శిని పంపి విచారణ చేపిస్తాం. సమస్య ఉంటే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– బీప సత్యనారాయణ, ఈఓపీఆర్డీ

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన మున్నుల జాన్ గురునాథ్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నెరుసు చిరంజీవి నూజివీడులో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ కమిటీల గురించి కొద్ది సేపు చర్చించారు. ఏలూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసి సమిష్టిగా పనిచేద్దామని పేర్కొన్నారు.



ప్రతాప్ అప్పారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిరంజీవి, జాన్ గురునాథ్

కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల వల్లే పరాజయం

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలే దోహదపడ్డాయని, కేవలం 4 శాతం ఓట్ల తేడాతో ఆప్ ఓడిపోయిందని, ఈ ఎన్నికల్లో ఆప్ గట్టి ప్రతిఘటన ఇవ్వగలిగిందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మతోన్మాద ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఇండియా కూటమి బలోపేతం కావాల్సిన ఆవశ్యకతను ఇప్పటికైనా గుర్తించాలని కోరారు. చంద్రబాబు వన్ నేషన్, వన్ ఎలక్షన్ అద్భుతమని కీర్తించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది ప్రాంతీయ పార్టీలకు తీరని దెబ్బ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీల హక్కుల కోసం పోరాడిన ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా బాబు వ్యవహరిస్తున్నారని, భవిష్యత్‌లో టీడీపీ మోదీ తెచ్చే వన్ నేషన్ వన్ ఎలక్షన్ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే టీడీపీ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని హరినాథ్ హెచ్చరించారు. పొట్టకూటి కోసం అమెరికా వెళ్లిన భారతీయులను వలసదారులుగా వెళ్లగొట్టే క్రమంలో కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి సైనిక విమానాల్లో తరలించడం అమానుషమన్నారు. భారతీయులను అగౌరవపరుస్తుంటే మోదీ నోరు మెదపకపోవడం ఆయన చర్యలను ఖండించకపోవడం గర్హనీయమన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఉత్సాహంగా జరిగింది. హనరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల విలువైన సలహాలు ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండో శనివారాన్ని పూర్వ విద్యార్థుల దినోత్సవంగా జరుపుతున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడారు. 2000–2004 బ్యాచ్ విద్యార్థులు రీ యూనియన్, మిగతా సంవత్సరాల వివిధ విభాగాలకు చెందిన 350 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సత్కరించారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు

తిరువూరు: స్థానిక శ్రీ నిధి జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ శనివారం జూనియర్ ఇంటర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు సూచనలిచ్చారు. వాహినీ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



‘పది’ విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా విధానంపై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసం పరీక్ష శనివారం తిరువూరులో నిర్వహించారు. ఎంఈఓ శ్యాంసుందరరావు పరీక్షా పత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టేందుకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము లీలాప్రసాద్, చెరుకు మోహన్‌కృష్ణ తెలిపారు. తిరువూరులోని శ్రీనిధి, నారాయణ, సిద్ధార్థ, శ్రీచైతన్య, భాష్యం స్కూళ్ళు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు. 400 మంది విద్యార్థులు హాజరయ్యారు.



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఎస్ఎఫ్ఐ నాయకులు

నులి పురుగుల నిర్మూలనతో రుగ్మతలు దూరం

ముసునూరు: నులి పురుగుల నిర్మూలనతో చిన్న చిన్న రుగ్మతలు దూరమై ఆరోగ్యంగా ఉంటామని పీహెచ్‌సీల వైద్యులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా అన్నారు. శనివారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీల బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. పాఠశాలల్లో బాలలకు నులి పురుగుల నివారణ మందులు వేశారు. గురుకులంలో ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ ఆధ్వర్యంలో బాలికలకు నులి పురుగుల మందు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నులి పురుగుల నివారణ మందులను చూపుతున్న వైద్యాధికారి

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

ఆగిరిపల్లి: తోటపల్లిలోని దుగ్గిరాల బాల రావమ్మ తల్లి తిరునాళ్ల ఏర్పాట్లను ఎస్ఐ శుభశేఖర్ శనివారం పరిశీలించారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో తోటపల్లిలో బాల రావమ్మ తల్లి తిరునాళ్లు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాలను ఎస్ఐ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లు నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



ఆగిరిపల్లి: విద్యార్థులను సన్మార్గంలో నడిపించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజ ఔన్నత్యాన్ని నిలబెట్టేది ఉపాధ్యాయులేనని ఏలూరు జిల్లా రిసోర్స్ పర్సన్ పగడాల సాంబశివరావు అన్నారు. తోటపల్లిలోని హీల్ పారడైజ్ పాఠశాల ఆవరణలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్‌కు రూ.1.75 లక్షలు విరాళంగా అందజేశారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, అకడమిక్ మోనటరింగ్ అధికారి రెడ్డి రామారావు, రిసోర్స్‌పర్సన్ హరికృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

నూజివీడు: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు నూజివీడు పట్టణంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో స్థానికులకు స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు బోను అప్పారావు, వైఎస్ దొరై తదతరులు పాల్గొన్నారు.